14.06.2020-Sakshi -Mancherial:

Clipping-9

# రుణమాఫీపై ఆనందం

- రూ.25 వేలలోపు రుణం పొందిన రైతుల హర్షం
- ఎన్నికల హామీ నెరవేర్చిన ప్రభుత్వం
- జన్నారం మండలంలో 1219 మందికి లబ్ధి
- మొత్తం రూ.1.89 కోట్ల రుణమాఫీ



**జన్నారం:** ఎన్నికల్లో ప్రకటించిన హామీని ప్రభుత్వం నెరవేర్చింది. తొలివిడతగా రూ. 25 వేల లోపు రుణం ఉన్న రైతులకు మాఫీ చేయడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. రైతుల మోములో ఆనందం వెల్లివిరుస్తోంది. రూ.25 వేలు లోపు బ్యాంక్ రుణాలు తీసుకున్నవారికి మాఫీ చేస్తూ సర్కారు డబ్బులు విడుదల చేసింది. జన్నారం మండలంలో సుమారు 12,850 మంది రైతులున్నారు. రుణమాఫీతో 1219 మందికి లబ్ధి చేకూరింది. వీరందరికీ రూ.కోటి89 లక్షల 14,123 మాఫీ అయ్యాయి. ఈ మాఫీతో అప్పు భయం పోయి వానాకాలంలో పంట వేసుకునేందుకు అన్నదాతలకు వెసులుబాటు కలిగింది. బ్యాంకు అధికారులు సైతం రుణాలు రెన్యూవల్ చేసుకునేందుకు ఈ ప్రక్రియ సులువైంది. సహకార బ్యాంకుల్లో స్వల్పకాల రుణాలు పొందేందుకు తాజాగా మాఫీ పొందిన లబ్ధిదారులు అర్హులయ్యారు.

**రెండోవిడత కోసం ఎదురుచూపు**

తొలివిడత రూ. 25 వేల రుణం తీసుకున్న రైతులు మండలంలో తక్కువ మంది ఉన్నారు. మొత్తం 11 వేలకు పైగా ఉన్నవారిలో రూ.లక్ష లోపు రుణాలు తీసుకున్న వారు అధికంగా ఉన్నారు. ఇంకా రెండోవిడత రుణమాఫీ ఎప్పుడు చేస్తారోనని రైతులు ఎదురుచూస్తున్నారు.

**ఏజెన్సీ రైతులకు రుణాలందేనా?**

ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనేతర రైతులకు ఆన్‌లైన్ పహాణి రాక గతేడాది నుంచి బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదు. కవ్వాల్‌లో సుమారు 500 పైగా మంది ఉన్నారు. భూ సర్వేలో భాగంగా గిరిజనేతర రైతులకు పట్టాలు లేని కారణంగా వారికి ప్రభుత్వం ఆన్‌లైన్ పహాణీలు ఆపివేసింది. దీంతో వారికి బ్యాంకులు పంట రుణాలు ఇవ్వడం లేదు. సంక్షేమ పథకాలు రైతుబంధు, రైతుబీమాతోపాటు రుణమాఫీ వర్తించడం లేదు. మ్యానువల్ పహాణీ ద్వారా రుణాలిచ్చి ఆదుకోవాలని, లేదా భూమి ఉన్న ఏజెన్సీ రైతులకు రుణాలు ఇచ్చేలా చూడాలని కోరుతున్నారు. రైతుబంధు వర్తించకపోవడంతో వారు నష్టపోతున్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

## మ్యానువల్ పహాణీతో రుణాలివ్వాలి



కవ్వాల్‌లో గిరిజనేతరుల రైతుల ఆన్‌లైన్ పహాణీని ఆపివేశారు. రెండేళ్ల నుంచి బ్యాంకుల్లో రుణాలు ఇవ్వడం లేదు. ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. మా బాధలను అర్థం చేసుకుని మ్యానువల్ పహాణీ ద్వారా పంట రుణాలు ఇవ్వాలి.

– మొతుకూరి నర్సగౌడ్, కవ్వాల్

## రుణాలిచ్చేందుకు సిద్ధం



సహకార బ్యాంకు నుంచి 89 మందికి రుణమాఫీ అయింది. వానాకాలంలో రైతులకు రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. ప్రభుత్వం నుంచి ఇప్పటికే రూ.50 లక్షలు సిద్ధంగా ఉన్నాయి. అవసరమైన రైతులు పట్టాపుస్తకం, ఆన్‌లైన్ పహాణీ, నాలుగు ఫొటోలు, తీసుకుని సహకార సంఘంలో సంప్రదించాలి.

– శీలం రమేశ్, సహకార సంఘం చైర్మన్, పొనకల్

సాక్షి Sun, 14 June 2020
https://epaper.sakshi.com/c/52726040